క్లుప్తంగా

బుగులు వెంకన్నను దర్శించుకున్న తహసీల్దార్



చిల్పూరు: నూతన తహసీల్దార్ సరస్వతీమాధవరావు దంపతులు ఆదివారం స్థానిక బుగులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారికి అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

స్నేహ యూత్ క్లబ్ కమిటీ



కొడకండ్ల : మండలకేంద్రానికి చెందిన స్నేహ యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్మెట్ట రాము, ప్రధాన కార్యదర్శిగా నర్మెట్ట శేఖర్, ఉపాధ్యక్షుడిగా కోట కొమురెల్లి, కోశాధికారిగా నర్మెట్ట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా వీరగోని రాందాస్‌గౌడ్, కార్యదర్శిగా నర్మెట్ట చిన్న ఉపేందర్ ఎన్నికయ్యారు. ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా నర్మెట్ట పెద్ద ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా బుర్ర వెంకన్న, ఉపాధ్యక్షులుగా పాలకుర్తి సరేష్, మిట్ట అరుణ్‌కుమార్, కార్యదర్శులుగా ముత్యం వెంకటేష్, పంతంగి సాయి, కార్యవర్గ సభ్యులుగా ఓడపల్లి రమేష్, నర్మెట్ట అయిలయ్య, బుర్ర రామచంద్రుతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు అందుకున్న కృష్ణ



జనగామ రూరల్: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణ ఉత్తమ లైబ్రేరియన్ అవార్డును అందుకున్నాడు. శనివారం రంగారెడ్డి జిల్లాలోని గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు.

అనుబంధ సంఘాల జిల్లా అధికార ప్రతినిధిగా యాకయ్య



పాలకుర్తి: ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్, ఎంఎల్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్, ఎంవైఎస్, ఎండియూ అనుబంధ సంఘాలకు మండలంలోని వావిలాలకు చెందిన ఇలబెల్లి యాకయ్యను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ఎస్సీ వర్గాలకు సరైన న్యాయం కోసం పోరాటం చేయాలని అన్నారు. తనకు ఈ పదవి అప్పగించినందుకు జాతీయ అధ్యక్షుడు బీ.ఎస్.రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా దేవయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియోజకవర్గంలోని పెద్దపెండ్యాలకు చెందిన ఆకారపు దేవయ్య నియమితులయ్యారు. ఈమేరకు బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం, జిల్లా అధ్యక్షుడు బసవగల సిద్దయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించిన, తన ఎన్నికకు సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీఎస్పీతోనే బహుజనులకు న్యాయం జరుగుతుందని, గ్రామగ్రామాన బీఎస్పీని బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

కొడకండ్ల : స్థానిక విద్యుత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ అధికారి మాలోత్ హుస్సేన్‌నాయక్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహించనున్నట్లు ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు లోడ్, ట్రాన్స్‌ఫార్మర్ల క్రమబద్ధీకరణ, లైన్ల మార్పిడి, విద్యుత్ బిల్లుల సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలాగే అక్రమంగా వ్యవసాయానికి విద్యుత్ వాడుకొనే వారికి డీడీలు వెంటనే కట్టుకొనే సదుపాయం కల్పించడం జరుగుతుందని, మోటార్లకు కెపాసిటర్లు కొనుగోలు చేసుకునేందుకై ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

డివిజన్ కేంద్రంలో సమస్యల తిష్ట

- భయంతో జీవనం సాగిస్తున్న ప్రజలు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



కాలనీలో తాము చంపిన నాగుపామును చూపిస్తున్న కాలనీవాసులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని 4వ వార్డులో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు వెంట కాలనీలో సమస్యలు తిష్టవేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, అనుక్షణం విషపురుగుల భయంతో జీవిస్తున్నామని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. కాలనీలో మోటం ప్రభాకర్, భూక్య శాలమ్మ, బాలయ్య, రాయపురం వెంకటలక్ష్మీ తదితరులు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కాలనీలో ఇళ్ల నిర్మాణం చేసుకుని దాదాపు 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, కనీసం డ్రెయినేజీ, సీసీ రోడ్లు, వీధిదీపాల సౌకర్యం లేదన్నారు. గత వారం రోజులుగా దాదాపు 15 పాములను చంపామన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, తహసీల్ ఆఫీస్, ఏసీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న మా కాలనీపై ప్రజాప్రతినిధులు, అధికారులు శీతకన్ను వేశారన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యపై పలుమార్లు సర్పంచ్, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించేలా సత్వర చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పసుల ఎల్లస్వామి, రాజేశ్వరి, గబ్బెట సుధాకర్, అందె వేణు, పుష్పారెడ్డి, అశోక్, ధన్‌రాజ్, కడమంచి ప్రకాష్, కర్రె రవి, దాసు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి సభకు తరలిన పద్మశాలీలు



రఘునాథపల్లి : సభకు తరలివెళ్తున్న పద్మశాలీలు

రఘునాథపల్లి/బచ్చన్నపేట/చిల్పూరు/ కొడకండ్ల పాలకుర్తిటౌన్ : జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆదివారం జరిగిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి రఘునాథపల్లి, బచ్చన్నపేట, చిల్పూరు, కొడకండ్ల, పాలకుర్తి మండలాల నుంచి పద్మశాలీ కులస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి మాట్లాడుతూ పద్మశాలీలకు జనాభా దామాషా ప్రకారం దక్కాల్సిన న్యాయమైన రాజకీయ ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం కోసం పద్మశాలీలు ఐకమత్యంగా ఉద్యమించాలని ఆయన పేర్కొన్నారు. తరలి వెళ్లిన వారిలో సంఘం మండల అధ్యక్షుడు కరిమికొండ వెంకటేశ్వర్లు, గుండా కృష్ణమూర్తి, శ్రీహరి, బిక్షపతి, సిద్దయ్య, మధుసూదన్, సోమనర్సయ్య, బాలరాజు, యాదగిరి తదితరులు ఉన్నారు. బచ్చన్నపేట నుంచి తరలిన వారిలో గుర్రపు బాల్‌రాజు, మంగళంపల్లి కృష్ణమూర్తి, కొండ హరికృష్ణ, చక్రాల రాజశేఖర్, రాపెల్లి వెంకటేశ్వర్లు పలువురు తరలివెళ్లారు. చిల్పూరు నుంచి పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు, చేనేత ఐక్య వేదిక స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజ్జెల దామోదర్ ఆధ్వర్యంలో చిన్నపెండ్యాల గ్రామం నుంచి తరలివెళ్లారు. పాలకుర్తి నుంచి సంఘం మండల కమిటీ అధ్యక్షుడు మాచర్ల సారయ్య, కోశాధికారి కూరపాటి సుదర్శన్, తెలంగాణ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మేడారపు సుధాకర్, నాయకులు కన్నయ్య, మార్గం లక్ష్మీనారాయణ, దేవసాని కృపాకర్, బిర్రు సోమనారాయణ, రాపోలు సోమేశ్వర్, చిలుక మారి సమ్మయ్య తరలిన వారిలో ఉన్నారు. కొడకండ్ల నుంచి మండల సంఘం అధ్యక్షుడు పసునూరి మధుసూదన్ ఆధ్వర్యంలో వెంకటనారాయణ, పొన్నం వెంకన్న, మనోహర్, ఉపేందర్, సత్తయ్య తదితరులు తరలివెళ్లారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి




శిబిరంలో పాల్గొన్న ఎస్సై రఘుపతి, సర్పంచ్

రఘునాథపల్లి: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఆయువు పోసేందుకు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్సై చాగర్ల రఘుపతి సూచించారు. ఆదివారం వెలుగు యూత్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలోని ఎల్లమ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ఇతరులు రక్తదాన శిబిరాలు నిర్వహించడంపై ఆసక్తి చూపాలని సూచించారు. స్థానిక ఆక్సిజన్ ఫార్మసీ, శ్రీ సాయి ఎలక్ట్రానిక్స్, హోమ్‌నీడ్ అండ్ ఫర్నిచర్ షాపు యజమానుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన శిబిరంలో 62 మంది రక్తదానం చేయగా వారిని ఎస్సై అభినందించి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్, యూత్ ప్రతినిధులు గండికోట రవీందర్, గట్టుపల్లి యాకస్వామి, గండికోట రాజశేఖర్, సుమన్, ఎండీ.యాకుబ్‌పాషా, రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

నర్మెట: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన భూక్య గురు, సునిత దంపతులకు అధికారులు న్యాయం చేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనగామ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి విషయాలు తెలుసుకున్న వారు మాట్లాడారు. బాధితులు పోలీసులను ఆశ్రయించినపుడు న్యాయం చేయడంలో ఫ్రెండ్లీ పోలీసులుగా వ్యవహరిస్తే బాధితులకు ధైర్యం కలుగుతుందని నిర్లక్ష్యం చేస్తే వారు మనోధైర్యాన్ని కోల్పోతారని అన్నారు.

ఉప్పలమ్మ తల్లికి నిమ్మకాయలతో అలంకరణ



జనగామ రూరల్: పట్టణంలోని అమ్మబావిలోని ఉప్పలమ్మ తల్లి ఆంజనేయ సమేత దేవాలయంలో ఆదివారం అధికశ్రావణ మాసం రోజున ఉప్పలమ్మ తల్లికి నిమ్మకాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా పూజారి వారణాసి పవన్‌శర్మ ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

స్వాగతం పలికేందుకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లెల సిద్ధారెడ్డి

జనగామ: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులై మొదటిసారిగా జిల్లా కేంద్రానికి ఈనెల 17న వస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు కార్యకర్తలు తరలిరావాలని పార్టీ సీనియర్ నాయకులు జిల్లెల సిద్ధారెడ్డి, ఉడుత రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డికి ఘనస్వాగతం పలకడానికి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, మోటె శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు, రామగళ్ల విజయ్‌కుమార్, ముస్త్యాల చందర్, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య, పట్వారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



దేవరుప్పుల : బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి దయాకర్‌రావు



జనగామ : బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

దేవరుప్పుల: మండలకేంద్రానికి చెందిన సీఐటీయూ కార్మికుడు, కారోబార్ ఎడవెల్లి వెంకట్‌రెడ్డి తల్లి కౌసల్య మృతి చెందగా ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

అండగా నిలిచిన తోటి కార్మికులు

మండలకేంద్రానికి చెందిన ఎడవెల్లి కౌసల్య అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుమారుడు సీఐటీయూ కార్మికుడు ఎడవెల్లి వెంకట్‌రెడ్డికి తోటి కార్మికులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, ఉప్పలయ్య, పరుశరాములు, ఐలయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జనగామ: జిల్లా కేంద్రంలోని ధర్మకంచె ప్రాంతానికి చెందిన శోమనబోయిన రాజు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఇటీవల మృతి చెందగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ గౌడ్ బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో రాజు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళరాజు, ఎంపీటీసీ తీగల సిద్ధుగౌడ్, వేముల లక్ష్మణ్‌గౌడ్, గంధమల్ల మల్లేష్, తిప్పారపు మహేష్, ఆకుతోట మురళీకృష్ణ, గద్ద సాయికుమార్, మహేష్, కౌశిక్, రవి, ఉదయ్, రాజు, అజయ్, వేణు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

బచ్చన్నపేట : మండల కేంద్రంలో పలువురి బాధిత కుటుంబాలకు కొండి బాగిరెడ్డి లక్ష్మమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు కొండి వెంకట్‌రెడ్డి ఆర్థికసాయాన్ని అందించారు. ఆదివారం మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఆటోడ్రైవర్ ఫాజిల్ భార్య, అలాగే ఆర్టీసీ డ్రైవర్ బషీరొద్దీన్ భార్య మృతి చెందగా వారికి ఆర్థికసాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందించినట్లు తెలిపారు. అలాగే మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన ఎస్సై కంకల సతీష్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మెన ఆంజనేయులు, షబ్బీర్, జావీద్, రాము, శ్రీనివాస్‌రెడ్డి, మోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



లింగాలఘణపురం: పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్ సాదం విజయ్‌మనోహర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ విజయ్‌మనోహర్‌ను రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఏఐసీసీ సభ్యుడు కిరణ్ ముగాబసవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు అవకాశం కల్పించి బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సత్యనారాయణ

మండలంలోని సిరిపురం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎంగాలి సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సమ్మయ్య, మల్లేశం ,ప్రధాన కార్యదర్శిగా సతీష్, కార్యదర్శిగా సుభాస్, అంజయ్యలను అదేవిధంగా కి సాన్ సెల్ అధ్యక్షునిగా కొత్త అంజయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బస్వగాని అనిల్, మండల యూత్ అధ్యక్షుడు సంపత్, నరేష్, ఉపేందర్, స్వామి, బీరయ్య, యాదగిరి, సిద్ధులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



జఫర్‌గఢ్ : బోనాలతో వెళ్తున్న ముదిరాజ్ కులస్తులు



పాలకుర్తి టౌన్ : బోనంతో ఝాన్సీరెడ్డి

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు తమ ఇండ్లల్లో బోనాలను ముస్తాబు చేయగా పోచమ్మ గుడి వద్ద కోళ్లు, మేకలను బలిచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం సమయంలో మహిళలు చిన్నారులతో కలిసి బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో శివశత్తుల పూనకాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం పోచమ్మ గుడి వద్ద బోనాలను పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ భక్తిని చాటుకోవడంతో పాటు మొక్కులు సమర్పించారు. కాగా జఫర్‌గఢ్, వడ్డెగూడెం వాసులు పాతురు వద్ద ఉన్న పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

బోనాల పండుగలో పాల్గొన్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బోనాల పండుగలో కాంగ్రెస్ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీ పాల్గొన్నారు. బోనాలను ఎత్తుకుని పోచమ్మ ఆలయం వరకు అందరితో కలిసి వెళ్లారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, పాలకుర్తి కాంగ్రెస్ నాయకులు కమ్మగాని నాగయ్య, మామిండ్ల యాకయ్య, భాస్కర్, దండయ్య తదితరులు పాల్గొన్నారు.

పగటి వేషగాళ్లు వస్తున్నారు

- రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి



మాట్లాడుతున్న రైతు బంధు సమితి జిల్లా కో–ఆర్డినేటర్ రమణారెడ్డి

బచ్చన్నపేట : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో పగటి వేషగాళ్లు నియోజకవర్గానికి వస్తున్నారని రైతుబంధు సమితి జిల్లా కో–ఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బచ్చన్నపేట మండలానికి సంబంధం లేని నాయకులు ఇటీవల వస్తూ పలు అంశాల్లో జోక్యం కల్పించుకుంటున్నారని అన్నారు. మరో నాయకుడు ఎల్‌ఓసీ, ఆర్థికసాయం పేర్లతో ఆయా గ్రామాలకు వెళ్తూ ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులతో సంబంధం లేకుండా వచ్చి వెళ్తున్నాడని అన్నారు. ఈ నాయకులు పార్టీ పేరు చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని ఈ పనులన్నింటిని సీఎం కేసీఆర్ కనుసన్నల్లతోనే చేయిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆ నాయకులు బీఆర్ఎస్ నాయకులను అనుసరించకుండా ఎలాంటి పనులను చేయకూడదని అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ ఉంటుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, నాయకులు బొమ్మెన ఆంజనేయులు, ఖైసర్, షబ్బీర్, జావీద్, మోహిన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, పాల్గొన్నారు.

జనగామలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే వేదికపై ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

జనగామ: పట్టణంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో 2001–02 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక హరిహర బ్యాంకెట్ హాల్లో ఆదివారం ఘనంగా జరిగింది. నాటి గురువులను శాలువాతో సన్మానించారు. చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యా, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలను, కుటుంబ నేపథ్యాలు చెప్పుకుంటూ సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రంరెడ్డి మురహరిరెడ్డి, ప్రభాకర్, సోమయ్య, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వీరయ్య, విద్యార్థులు సౌజన్య, ప్రమోద, స్వాతి, స్వర్ణలత, సతీష్, రంజిత్, ఈసా, గౌస్, తిరుపతి, వినయ్, శ్రీనివాస్ ,నవీన్, సంతోష్, రమేష్, బాలరాజ్, రఘురాం, చంద్రయ్య, పరుశరాం, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో అభివృద్ధి

ధర్మసాగర్ (వేలేరు) : ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య సహకారంతో వేలేరు మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదివారం వారు భూమి పూజ చేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ, జెడ్పీటీసీ నిధుల నుంచి మంజూరైన 15వ ఫైనాన్స్ నిధులతో 1,25,000లతో వేలేరులోని ఖబ్రస్తాన్‌లో బోరు వేయిస్తున్నట్టు తెలిపారు. అలాగే కమ్మరిపేటలోని పల్లెప్రకృతి వనంలో రూ.1.65 లక్షలతో బోర్ వేయిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

జఫర్‌గఢ్ : బీఆర్ఎస్‌ను గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ నాయకులు కుల్లా మోహన్‌రావు, బానోతు రాజేష్‌నాయక్ అన్నారు. మండలంలోని తిడుగు గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన కడియం వర్గీయులు ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నల్లతీగల భాష, సర్పంచ్ చందా స్వప్న భాస్కర్, రేగడితండా సర్పంచ్ భూక్య పార్వతి రవి, కడియం యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

- ఏఎన్ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.కవిత



దీక్షలో మాట్లాడుతున్న కవిత

జనగామ రూరల్: ఏఎన్ఎంలు అనేక అవస్థలు పడుతూ ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఏఎన్ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.కవిత, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద చేపడుతున్న దీక్షలు 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సెకండ్ ఏఎన్ఎంలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అనిత, రజిత స్వప్న పాల్గొన్నారు.

కృష్ణాజీగూడెంలో హడలెత్తిస్తున్న కుక్కలు



వార్డులో సంచరిస్తున్న కుక్కలు

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం 3వ వార్డులో గత రెండు రోజులుగా వీధికుక్కలు ప్రజలను హడలెత్తిస్తున్నాయని వార్డుకు చెందిన ఊరడి రాజు తెలిపారు. ఇళ్లలో నుంచి ఎవరైనా బయటకు వస్తే వెంట పడుతున్నాయని, పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలన్నా, ఇళ్లలో ఉంచాలన్నా భయమేస్తుందని అన్నారు. ఇక రాత్రి వేళ ద్విచక్ర వాహనాలపై వచ్చే వారివెంట పడడంతో ఒకరిద్దరు కింద పడి గాయాలైన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రమాదాలు జరుగక ముందే నివారణ చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.